సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

పిహెచ్‌సి వైద్యాధికారి ఆకుల చిరంజీవి

నరసాపురం : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పుతాళ్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆకుల చిరంజీవి సూచించారు. జ్వరం, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించి అవసరమైతే రక్త పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలని అన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్ని మాత్రమే తినాలని సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లే ప్రజలు పాముకాటు రక్షణ బూట్లు ధరించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుక్క, పాము, తేలు, పిల్లి, ఎలుక కాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ వైద్యశాలలకు ఏమాత్రం తగ్గకుండా వచ్చిన రోగులకు మంచి వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పంచాయతీ' పరేషాన్..!

- ఎన్నికపై ఈ నెల 3న ప్రభుత్వానికి ఎన్నికల కమీషన్ లేఖ
- ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ సైతం విడుదల
- అక్టోబర్ 16వ తేదీ లోపు డీలిమిటేషన్ పూర్తికి షెడ్యూల్
- జనవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక
- ప్రభుత్వ నుంచి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు మౌనం
- గ్రామాల్లో వాడీవేడీగా పంచాయతీ ఎన్నికలపై చర్చ
- ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు
- పోటీచేసే ఆశావాహుల్లో ఉత్కంఠ.. ఎన్నికల నిర్వహణపై సందేహాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీ ఎన్నికలపై అయోమయం నెలకొంది. సకాలంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా అన్న సందిగ్ధత నెలకొంది. జనవరిలో పంచాయతీ ఎన్నికల నిర్వహించనున్నట్లు, ఈ లోగా అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఎన్నికల కమిషన్ ఈ నెల మూడో తేదీన ప్రభుత్వానికి లేఖ రాసింది. ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ సైతం విడుదల చేసింది. అక్టోబర్ 16వ తేదీలోగా డీలిమిటేషన్ ప్రక్రియ, రిజర్వేషన్లు ఖరారు చేయాలని, అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15వ తేదీలోపు వార్డులవారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు రిటర్నింగ్ అధికారులను నియమించుకోవాలని, నవంబర్ 16 నుంచి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకుని తుది జాబితా సిద్ధం చేసి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. డిసెంబర్ చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, 2026 జనవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్‌లో ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఇది జరిగి దాదాపు 20 రోజులు గడిచిపోతోంది. ఇప్పటి వరకూ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కదలిక లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ఇప్పటికీ ప్రారంభించలేదు. అక్టోబర్ 16వ తేదీలోపు డీలిమిటేషన్ పూర్తిచేయాలని ఎన్నికల కమీషన్ పేర్కొన్నా ఇప్పటి వరకూ కదలిక లేకపోవడం చూస్తే ఎన్నికలు సకాలంలో జరుగుతాయా అన్న సందేహం ఏర్పడుతోంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. 2020 ఫిబ్రవరిలో నాలుగు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. నాలుగో విడత ఎన్నికలు ఫిబ్రవరి 21వ తేదీతో ముగిశాయి. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికల కాలం ఐదేళ్ల ముగియనుంది. ఆ లోగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నట్లు ఎన్ని కమీషన్ లేఖ చెబుతోంది. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదన్న వాదన వినిపిస్తోంది. ఎన్నికల కమీషన్ లేఖతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మాత్రం మొదలైంది.

ఆశావాహుల్లో ఉత్కంఠ.. ఎన్నికల నిర్వహణపై సందేహాలు

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచిగా పోటీ చేయాలనుకునే ఆశావాహులంతా ఇప్పటికే రాజకీయ నేతలను కలుస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ హడావుడీ చేస్తున్నారు. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లు ఏ విధంగా ఉంటాయన్న అంచనాలు వేసుకుని అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఎన్నికల నిర్వహణపై సందేహాలు అలుముకున్నాయి. అక్టోబర్ రెండో తేదీ తర్వాత ఎన్నికల పనులకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయంటూ అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. జిల్లాల విభజన సమస్యలు పూర్తిచేసిన తర్వాత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలవుతోందన్న అభిప్రాయం సైతం వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా పంచాయతీ ఎన్నికలపై మాత్రం గ్రామాల్లో సందడి కొనసాగుతోంది. గెలుపోటములపై అంచనాలు వేసుకుంటూ అభ్యర్థులకు సంబంధించి చర్చ నడుస్తోంది.

తాళం సూర్యనారాయణమూర్తి రైతు కార్మిక, ప్రజా సంఘాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంతెన సీతారాం

జిల్లాలో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం పడింది. ఇళ్లల్లోని వారు భయభ్రాంతులకు గురయ్యేలా ఉరుములు, మెరుపులు మెరిశాయి. దీంతో ముందు జాగ్రత్తగా విద్యుత్ నిలిపేశారు. దీంతో దేవీ నవరాత్రుల వేడుకలు నిర్వహించే పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ నెల 24న సిఎం చంద్రబాబు పాలకొల్లు విచ్చేస్తున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వివాహానికి హాజరు కానున్నారు. వర్షంతో యుద్ధప్రాతిపదికన జరుగుతున్న పనులకు ఆటంకం ఏర్పడింది.

మొగల్తూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాలకొల్లులో పడుతున్న వర్షం

ఐ.భీమవరంలో పిడుగు..

ఆకివీడు : మండలంలోని ఐ.భీమవరంలో గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగు పడింది. దీనికితోడు ఈదురు గాలులు, ఉరుములు, వర్షంతో వాతావరణం బయోత్పాతంగా మారింది. స్థానిక పంచాయతీ ఆఫీస్ దగ్గరలోని గుడిపాటి వెంకటేశ్వరరావు, వత్సవాయి బద్రి రాజు ఇంటి వద్ద పిడుగు పడింది. వత్సవాయి బద్రిరాజు పెరట్లో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు మొత్తం మాడిపోయింది. ఇంటిని ఆనుకుని చెట్టు ఉండడంతో పిడుగు ప్రభావానికి ఇంట్లోని ఎలక్ట్రానిక్స్ గూడ్స్ మొత్తం మాడిపోయాయి. విద్యుత్ కనెక్షన్స్ తెగిపోయాయి. అలాగే గుడిపాటి వెంకటేశ్వరరావు నివాసం వద్ద పిడుగు పడి చెట్టు మాడిపోయింది. మూడు పిడుగులు వరుసగా పడినప్పటికీ ఏ విధమైన ప్రాణహాని సమాచారం లేదు. ఈ పిడుగులు ప్రభావంతో గ్రామంలో ఆస్తి నష్టం భారీగా ఏర్పడి ఉంటుందని అంచనా.

మొగల్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. భారీ గాలులతో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఉదయం నుండి సాయంత్రం వరకూ అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఎండ వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

పెంచిన పనిగంటలు తగ్గించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్

ప్రజాశక్తి - ఇరగవరం(తణుకు)

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పనిగంటలు తగ్గించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరగవరం మండల కేంద్రంలో సిఐటియు మహాసభ అంబటి అమరావతి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ప్రతాప్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాలను 13 గంటలకు పెంచారని, ఇది దుర్మార్గమైన చర్యని అన్నారు. ప్రపంచంలో కార్మికులు పని దినాలు తగ్గించాలని, వారి ప్రాణ త్యాగాలు చేసి ఎనిమిది గంటల పని దినాలను సాధించుకున్నారని, నేడు కార్మిక చట్టాలన్నిటిని మార్చేస్తున్నారని, వాటి కోసం మనమంతా పోరాటాలు చేయాలని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు అడ్డగర్ల అజయ్ కుమారి మాట్లాడుతూ.. కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం బానిసలుగా పనిచేస్తుందన్నారు. కార్మికులపై పని భారాన్ని, ఒత్తిడిని పెంచారని కనీస వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారంలోకి వచ్చిన తర్వాత పనిభారాన్ని పెం చారన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారులోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలు 43ను మూడు చట్టాలుగా మార్చేశారని అన్నారు. పారిశ్రామిక వేత్తలకు అనుగుణమైన చట్టాలుగా మార్చారని, దీనివల్ల కార్మికులు రోడ్డున పడ్డారన్నారన్నారు. కార్మికులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని దానికి ఐక్య పోరాటాలే శరణ్యమని ఆయన మహాసభలో గుర్తు చేశారు. మహాసభకు ముందు సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికున్నారు. సిఐటియు మండల కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు, కో కన్వీనర్‌గా సిహెచ్.విజయ్ కుమారి, కమిటీ సభ్యులుగా ఎ.అమరావతి, ఎన్.రూపావతి, జె.సత్య దేవి, కె.సత్యవతి, పి.నాగరాజు, జి.బాలకృష్ణ, ఎన్.ఏసు, పి.వరలక్ష్మి, కామన మునిస్వామి ఎన్నికైయ్యారు.

మానవత్వంతో చంద్రబాబు సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పునరుద్ధరణ

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

చంద్రబాబు మానవత్వంతో పేద, మధ్య తరగతికి చెందిన వారికి సిఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్య సాయం అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలో 75 మందికి సిఎం సహాయ నిధి నుంచి చెక్కులను ఆదివారం సాయంత్రం అందించారు. చంద్రబాబు మానవత్వంతో పేద, మధ్యతరగతులకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్య సాయం అందిస్తున్నారని చెప్పారు. వైసిపి ఐదేళ్ల పాలనలో సిఎం సహాయ నిధిని రద్దు చేయగా చంద్రబాబు పునరుద్ధరించారు. ఒక్క ఛాన్స్ అంటూ జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి తీసుకు వెళ్లాడని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా కూటమి ప్రభుత్వం తీసుకు వెళుతోందన్నారు. రాష్ట్ర విభజన నష్టం కన్నా జగన్ ఐదేళ్ల పాలనలోనే ఎక్కువ నష్టం జరిగిందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు సాయం అమలు చేస్తున్నామన్నారు. పెన్షన్ సొమ్ము పెంపు, మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.13 వేలు అందిస్తున్నట్లు చెప్పారు.

రోగులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్‌లను అందిస్తున్న మంత్రి నిమ్మల

బీచ్‌లో పర్యాటకులు

బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరు పాలెం సౌత్, కెపి పాలెంసౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు ప్రకృతి ప్రేమికులు, ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

జగన్మోహన్ రెడ్డికి రూల్స్ తెలియవా..?

మీడియా సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మాజీ ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు హాట్ కామెంట్స్ చేశారు. పెదఅమిరంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ జగన్ ఎంపీగా, గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఐదేళ్లు, ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆయనకు రూల్స్ తెలియకుండా కామెంట్స్ చేస్తారా అని కొంతమందైనా కన్‌ఫ్యూజ్ అయ్యే అవకాశం ఉందని తనకు అనిపించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అడుగుతున్నారు కదా ఆ నిబంధన ఉందా అని కొద్దిమంది తనను అడుగుతున్నారన్నారు. భారత రాజ్యాంగం 190(4) చాలా స్పష్టంగా ఉందన్నారు. ఎవరైనా లీవ్ ఆఫ్ యాక్షన్స్ అడగకుండా కంటిన్యూస్‌గా 60 రోజుల పాటు సమావేశాలకు హాజరుకాకపోతే శాసనసభ సభ్యత్వానికి, పార్లమెంటు సభ్యత్వానికి అనర్హులన్నారు. అది అసెంబ్లీకి 187(2) రూల్స్ ఆఫ్ ప్రొసీజర్ అండ్ కాండెక్ట్ ఆఫ్ బిజినెస్ ఆఫ్ ఎపి అసెంబ్లీలో కూడా స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. అసెంబ్లీ రూల్స్ నెట్‌లో ఉంటాయి, వైసిపి అధ్యక్షులు, సలహాదారులు, ఎంఎల్‌ఎలు చూసుకుంటే ఎవరు ఎవరిని తప్పుదోవ పట్టిస్తున్నారు అనేది అర్థం అవుతుందన్నారు. ప్రతిపక్షానికి ఎంత సమయం ఇవ్వాలి అనేది ఆ పార్టీల స్ట్రెంత్‌ను బట్టి ఆ సమయం ఉంటుందని, అదీ ఓన్లీ సూచన, స్ట్రిట్‌గా ఫాలో అవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రతీ రోజూ క్వశ్చన్ అవర్‌లో రెండు ప్రశ్నలు వైసిపి వారికి వస్తున్నాయి. వాళ్లు ఎవరూ సభలో ఉండడం లేదన్నారు. శాసనసభలో సభ్యతా సంస్కారాలతో మాట్లాడుతున్నప్పుడు కాస్త ఎక్కువ సమయం ఇచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో అసెంబ్లీ 68, 69 రోజులు మించి జరగలేదని తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపన

నరసాపురం : మండలంలోని తూర్పుతాళ్లు పంచాయతీ చామకూరి మెరకలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆదివారం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక వసతుల పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, వలవల నాని, మైల వసంతరావు, బందెల రవీంద్ర, వాతడి కనకరాజు, పోలిశెట్టి నళిని, దేశీనీడి గంగాధర్, బల్ల హనుమంతు, రావూరి సురేష్, పులపర్తి సత్యనారాయణ, పులపర్తి వంశీ, పులపర్తి రాంబాబు, వలవల మురళి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్

దొంగల నుండి రక్షణకు లాక్‌డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్

ఫోన్‌లో యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి

భయపడాల్సిన పనిలేదు : పోలీసులు

ప్రజాశక్తి - నరసాపురం

మీరు.. మీ కుటుంబం యాత్రలకు, దసారా సెలవలకు ఊరు వెళ్లాల్సి వస్తోందా.. అక్కడ ఎక్కువ రోజులు ఉండాల్సి వస్తోందా.. దొంగ భయంతో మీ ధ్యాసంతా ఇంటిపైనే ఉంటోందా.. అయితే ఇక భయపడాల్సిన పనిలేదని అంటున్నారు పోలీసులు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు లాక్‌డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. మీరు తీర్థయాత్రలకు వెళ్లినా దొంగల గురించి భయపడాల్సిన అవసరం లేదని పోలీసులు అంటున్నారు. తాళం వేసినప్పుడు మీ ఇంటి భద్రత కోసం ఎపి పోలీసులు అందిస్తున్న ఉచిత సదుపాయం ఈ యాప్ అని తెలిపారు.

ఎలా ఉపయోగించాలి అంటే..

మొదటి గూగుల్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తరువాత అందులో చిరునామా, సెల్ ఫోన్ నెంబర్, తదితర వివరాలను నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ అనంతరం వాటికి యూనిక్ ఐడి ఇస్తారు. మీరు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేంత వరకూ సీసీ కెమెరా టెక్నాలజీ ద్వారా మీ ఇంటిపై నిఘా ఉంచుతారు. ఎప్పుడైనా మీరు ఊరు వెళ్లాల్సి వచ్చినట్లయితే యాప్‌లోని రిక్వస్ట్ వాచ్‌లో పలానా రోజు నుంచి పలానా రోజు వరకూ ఇంటికి తాళం వేసి వెళ్తున్నట్లు తెలిపాలి.

సమాచారం ఇవ్వాలి..

ఊరు వెళ్లక ముందే పోలీసులు మీ ఇంట్లో కెమెరాలు అమరుస్తారు. వైర్‌లైస్ మోషన్ కెమెరా(కెమెరా ముందు కదలిక కనిపిస్తే రికార్డు చేసే కెమెరా)ను ఏర్పాటు చేస్తారు. అప్పటి నుంచి మీ ఇళ్లు కెమెరాల నిఘాలో ఉంటుంది. కెమెరాను పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఇంటి యజమాని మొబైల్‌కు అనుసంధానం చేస్తారు. కెమెరా ముందు గుర్తు తెలియని వ్యక్తులు గాని, ఏదైనా కదలిక జరిగితే వెంటనే ఫొటోలు, వీడియోలు తీసి కంట్రోల్ రూమ్‌కు పంపే సౌకర్యం సైతం ఉంటుంది. దీనివల్ల దొంగలు మీ ఇంటిలోకి వస్తే వెంటనే నైట్ గస్తీ తిరుగుతున్న పోలీసులకు, పోలీస్ స్టేషన్‌కు వెంటనే సమాచారం అందిస్తారు. తద్వారా దొంగతనం చేసేందుకు వచ్చిన దొంగలను పట్టుకునేందుకు ఈ కెమెరాలు ఎంతో సహకరిస్తాయి. అందువల్ల ప్రజలు ఈ యాప్‌ను వినియోగించుకుని తమకు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు

ఈ యాప్‌ను వినియోగించుకోవాలి

బి.యాదగిరి, నరసాపురం పట్టణ సిఐ

పోలీస్ యం త్రాంగం ప్రవేశపెట్టిన యాప్‌ను ప్రజలంతా వినియోగించుకోవాలి. దొంగల నివారణకు ఎంతో ఉపయోగపడుతుంది. గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ సదుపాయం అంతా ఉచితం. వీరు ఊరు వెళ్లాల్సి వచ్చినప్పుడు పోలీసులకు సమాచారం అందించి ఈ యాప్‌లో పూర్తి వివరాలు నింపుకోవాలి. ఎటువంటి సందేహాలు ఉన్నా, యాప్ ఇన్‌స్టాల్ చేయడం రాకపోయినా నరసాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చు.

ఎరువుల కొరతను నివారించాలి

తాడేపల్లిగూడెం : ఎరువుల కొరత నివారించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, నాయకులు సిరపరపు రంగారావు, కసిరెడ్డి శివ తెలిపారు. స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్, ఉల్లిపాయలు మార్కెట్ యూనియన్ ఆఫీస్ వద్ద రైతులతో విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల కోటా కేంద్రం నుంచి తెచ్చుకోకుండా కూటమి ప్రభుత్వం మోసకారి మాటలతో రైతులను మాయ చేస్తోందన్నారు. ఎరువులను వాడకాన్ని తగ్గించుకుంటే బస్తాకు 800 రూపాయలు ఇస్తామని ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యవసాయానికి కీలకమైన ఎరువు యూరియా అని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంపడంలో పది శాతం తగ్గించుకొని పంపుతామని, ఆ తగ్గించిన ఎరువులకు రాష్ట్ర ప్రభుత్వాలకు సబ్సిడీ రూపంలో నగదు అందిస్తామని చెప్పిందని తెలిపారు. దీన్ని కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకించాయని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు 20 శాతం ఎరువులు తగ్గించుకోవడానికి 500 కోట్లు రూపాయలు కేంద్ర ప్రభుత్వ వద్ద ఒప్పందం పడ్డారని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల రైతుల దగ్గర వచ్చిన వ్యతిరేకతను చల్లార్చడానికి బస్తాకు 800 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పడం రైతాంగాన్ని అవమానపర్చడమేనని తెలిపారు. చంద్రబాబు నాయుడు యూరియా వాడడం వల్ల కేన్సర్ వస్తుందని, వాడకం తగ్గించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ శాస్త్రవేత్తలూ ఆయనకు చెప్పారో వెల్లడించాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చల్లా చంద్రరావు, పెనగంటి దుర్గ, కరక వెంకట్రావు, దత్తు రాము, గోవాడ రమేష్, ఆదిరెడ్డి సత్యనారాయణ, నమ్మిన శ్రీను, ఏలూరు వెంకన్న, నిమ్మల తాతయ్య పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గ స్థాయిలో ఈనెల 29వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్న సభ్యులను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అభినందించారు. పెదఅమిరం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం తనయుడు భరత్‌తో కలిసి బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉండిలో ఇటీవల అభివృద్ధిపరిచిన మాజీ మంత్రి అబ్బాయిరాజు జన్మభూమి పార్కులో భరత్ యూత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, భరత్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న కమిషనర్ బి.విజయ సారథి

కంటి వైద్య శిబిరంలో పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు సన్‌రైజ్, చవాకుల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రాధాకృష్ణ నేత్రాలయం భీమవరం, ఆదిత్య మల్లి స్పెషాలిటీ క్లినిక్, పాలకొల్లు వారి సౌజన్యంతో పాలకొల్లులోని ఎల్‌బి హౌసింగ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చవాకుల సూర్య నరేష్ బాబు, రోటరీ క్లబ్ పాలకొల్లు సన్‌రైజ్ అధ్యక్షులు మాజేటి సూర్యనారాయణ(రాజా), సిరిగిడి రాంబాబు, నెలకుర్తి కృష్ణమోహన్, బొక్క రమాకాంత్, రుంకాని విజయ భగవాన్ పాల్గొన్నారు.


ఆచంటలో బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎంఎల్‌ఎ పితాని

పలువురికి సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో దారిద్ర్య రేఖ దిగువనున్న పేదలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 79 మంది బాధితులకు ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ రూ.35 లక్షల, 88 వేల, 576 నగదు విలువ గల చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి కూటమి మండల, గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లోని పలువురు లబ్ధిదారులకు ఇక్కడ వెళ్లి రూ.11,35,345 అందజేశారు. సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని నాయకర్ పేర్కొన్నారు.

24 నుంచి పోటీపరీక్షల శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి యువకులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల నుంచి ఈనెల 24 నుంచి అక్టోబర్ 6 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, విశాఖపట్నం కేంద్రాలుగా శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. యుపిఎస్‌సి, ఐబిపిఎస్, ఆర్‌ఆర్‌బి, ఎస్‌ఎస్‌సి తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వీరికి ఆయా జిల్లా కేంద్రాల్లో అక్టోబర్ 12న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 99496 86306 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు. ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఆసక్తిగల సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు.

శ్రీనివాసరాజుకు ధార్మిక సేవా అవార్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రముఖ ఆక్వా ప్రతినిధి, పెనుమంట్ర ఉప సర్పంచి భూపతిరాజు శ్రీనివాసరాజుకు ధార్మిక సేవా అవార్డు లభించింది. తిరుపతి ధ్యాన మహాయజ్ఞం కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన ఛానల్ ద్వారా ప్రపంచ శాంతి, సనాతనధర్మం, ఆధ్యాత్మికం, మానసిక ఉల్లాసం వంటి అంశాలపై భక్తులకు అవగాహన కల్పించినందుకుగాను పిరమిడ్ మెడిటేషన్ ఛానల్ అధ్యక్షులు దాట్ల హనుమంతరాజు చేతులమీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీత శ్రీనివాసరాజును అభినందించిన మాజీ గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి(వాసు), జెడ్‌పిటిసి సభ్యులు, గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరి సుభాషిణి వేణుబాబు, సర్పంచులు తాడిపర్తి ప్రియాంక ప్రసన్న, గూడూరి దేవేంద్రుడు, బుర్రా రవికుమార్, మట్టా కుమారి రాము, కోట సరోజిని వెంకటేశ్వరరావు, సుంకర సీతారాం, సువర్ణరాజు, వైస్ ఎంపిపి కిరణ్, అనిత, వైసిపి నాయకులు అభినందించారు.

నిధుల సేకరణకు కృషి

కృష్ణబలిజ పూసల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గంటా త్రిమూర్తులు

పాలకొల్లు : సిఎం చంద్రబాబు ఆశీస్సులతో ఇటీవల కృష్ణబలిజ పూసల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన గంటా త్రిమూర్తులు పూలపల్లి కృష్ణ బలిజ సంక్షేమ సంఘం వద్దకు ఆదివారం విచ్చేసారు. ఆయనకు సంఘీయులు గంటా నర్సింహమూర్తి సారథ్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తమ సంఘీయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల గురించి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పూలపల్లిలో 45 సంవత్సరాలుగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించడం సామాన్య విషయం కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంటా వెంకన్న, పట్టణ అధ్యక్షులు ముదరకోల సత్యనారాయణ, కార్యదర్శి బక్కా ఆదిబాబు, కోశాధికారి గంటానాగరాజు, గంటా సాయిబాబా పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసిన బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడడి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

తొలగించాలని ప్రజల వేడుకోలు

రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

నరసాపురం : మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామం బైనపాలెం సెంటర్‌లో సీసీ రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మూడు విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ఇటీవల లక్ష్మణేశ్వరం నుండి తూర్పుతాళ్లు వరకూ నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు మధ్యలో స్తంభాలు మరిచారు. ఈ రోడ్డు మార్గంలో వెళ్తే రోడ్డు మధ్యలో పలు కరెంట్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. నిత్యం తీర ప్రాంత వాసులు, స్కూల్స్, కాలేజీ బస్సులు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటాయి. పొరపాటున భారీ వాహనాలు అదుపు తప్పితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్డులో కరెంట్ స్తంభాలను తొలగించకుండానే కాంట్రాక్టర్ రోడ్డు పనులను పూర్తి చేశారు. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉండటంతో రోడ్డు మధ్యలో దాదాపు చాలా కరెంట్ పోల్స్ ఉండటం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంలో అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ పోల్స్‌ను తొలగించాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు!

రోజుకు ఐదు నుండి 7 గంటల వరకూ కోత
రాత్రయితే జాగారమే
విద్యుత్ అధికారులు దృష్టి సారించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పలు గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు విద్యుత్ వినియోగదారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పగలు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, రాత్రి వేళల్లో ఉక్కపోత కారణంగా కరెంటు కోత తోడు కావడంతో వృద్ధులు, చిన్నారులు, పలు వ్యాధులతో బాధపడుతున్న వాళ్లు నానా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రజాప్రతినిధులు మండల పరిషత్ సమావేశంలో హెచ్చరించినప్పటికీ అధికారుల తీరులో మాత్రం ఎటువంటి మార్పు కనపడటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. రాత్రిపూట తొమ్మిదిన్నర గంటలకు కరెంటు కోత విధించి తిరిగి 11:45కు విద్యుత్ సరఫరా చేశారు. మళ్లీ లైన్లు తెగిపోయాయంటూ కరెంటు కోత విధించి తెల్లవారుజాము నాలుగు గంటలకు సరఫరా చేశారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా.. అధికారుల పనితీరులో మార్పు రాలేదని మండిపడుతున్నారు.

సమస్య ఏర్పడితే ఆ సమస్య పరిష్కరించడానికి గంటల తరబడి సమయం పట్టడానికి ప్రధాన కారణం నియోజకవర్గంలోని పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట మండలాల సబ్ ఇంజనీర్లు ఇన్‌ఛార్జిలు కావడమేనని ఉంటున్నారు. వీరి కింద పనిచేసే లైన్ ఇన్‌స్పెక్టర్లు లైన్లు పునరుద్ధరించాలంటే తణుకు, పెరవలి, తిల్లపూడి గ్రామాల్లో నివాసముంటూ స్థానిక మండలాల్లో పనిచేస్తున్నారు. సమస్య ఏర్పడిన తర్వాత బయలుదేరి రావడానికి కొంత సమయం, పని పూర్తి చేయడానికి మరికొంత సమయం పడుతుందని దీంతో విద్యుత్ వినియోగదారులకు అగచాట్లు తప్పడం లేదని అంటున్నారు.

మరుగునపడిన పారిశుధ్యం..

గ్రామాల్లో పా రిశుధ్యం మరుగున పడటంతో దోమలు ప్రజలపై విజృంభిస్తున్నాయి. విద్యుత్ కోతతో ఆరుబయట సేద తీర్చుకునేందుకు వస్తే దోమలు విజృంభిస్తున్నాయి. ఒకపక్క కరెంటు కోత, ఉక్కపోత దోమల ఉధృతికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

విద్యుత్ వినియోగదారులకు హెచ్చుతగ్గులు లేని విద్యుత్‌ను సరఫరా చేయడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని నత్త రామేశ్వరానికి చెందిన వినియోగదారులు హై వోల్టేజీ కారణంగా విద్యుత్ గృహపకరణాలు దెబ్బతిన్నాయంటూ ఇటీవల పెనుమంట్ర సెక్షన్ ఇన్‌ఛార్జి ఎఇ గూడూరి నాగరాజుకు మెమొరాండాన్ని సమర్పించారు. అయినప్పటికీ సరఫరాల్లో ఎటువంటి మార్పులు కనిపించలేదు. పెనుగొండ నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ప్రత్యా మ్నాయంగా భీమవరం సెక్షన్ నుండి విద్యుత్తును తీసుకుని సరఫరా చేయాల్సి ఉంది. కానీ అధికారులు ఆల్‌టర్నేటివ్ సరఫరా కోరకుండానే వినియోగదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా, అనధికార విద్యుత్ కోతలు లేకుండా చేయాలని మండలం లోని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

నెగ్గిపూడి వద్ద విద్యుత్ సర్వీసు పరిస్థితి (ఫైల్ ఫొటో)

నిలిచిన డ్రైయినేజీలోని నీరు

రోడ్డుపైకి ఇళ్లలోని వాడకపు, మురుగు నీరు

కాలువల్లేక.. మురుగు పారక

రోడ్లపై నిలిచిన మురుగు నీరు
తీవ్ర దుర్గంధంతో స్థానికుల ఆందోళన
దోమల విజృంభణతో అవస్థలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారిపై ఇళ్లల్లోని వాడకపు, మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డుపై మురుగు వదులుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌అండ్‌బి రహదారికి ఆనుకుని ఉన్న ఆక్రమణలను ఇటీవల ఆర్‌అండ్‌బి, పంచాయతీ అధికారులు తొలగించారు. తొలగించిన తూరలను అక్కడే వదిలేశారు. కాలువలను విస్మరించడంతో మురుగు, వాడుక నీరు బయటకు వెళ్లే మార్గంలేక రోడ్డుపై నిలిచిపోయి రాకపోలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కచ్చా డ్రెయినేజీని చేయకపోవడంతో నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దీనికి తోడు దోమలు విజృంభిస్తుండటంతో స్థానికులకు కంటిమీద కునుకు కరువైంది. మురుగు నీరు వారం రోజులైనా తొలగడం లేదు. పంచాయతీ, వైద్యశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. తూరలను తొలగించి డ్రెయినేజీని శుభ్రం చేయించి, ఇళ్లల్లోని మురుగు నీరు బయటకు వదలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

'నీకోసం' షార్ట్ ఫిల్మ్ బృందానికి అభినందన

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఐక్య నేషనల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలను వివరిస్తూ నిర్మించిన 'నీకోసం' షార్ట్ ఫిలింను తిలకించి షార్ట్ ఫిలిం బృందాన్ని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదివారం పెదఅమిరంలో అభినందించారు. నిర్మాతగా వై.శ్రీనివాస ఆచారి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా ఉపయోగిస్తూ నిర్లక్ష్యంగా ఉండే ఒక తండ్రిని మార్చడానికి ఉపాధ్యాయుడి ప్రేరణతో ప్రయత్నం చేస్తూ తమ స్కూల్లో జరగబోయే ప్లాస్టిక్ అవేర్నెస్ కాంపిటీషన్‌కి సిద్ధమవుతున్న అతని కూతురు. ఈ ప్రయత్నాల మధ్య ఆమె ప్రమాదానికి గురవుతుంది. ఆసుపత్రిలో ప్లాస్టిక్ సంబంధిత వ్యాధి బయటపడుతుంది. ఈ సంఘటన తండ్రిని కుదిపేస్తుంది, అతని మనసులో మార్పు వస్తుంది. కూతురి కలను నెరవేర్చుతూ, తను తీసుకువచ్చిన ప్రైజ్‌ను చూసి, నాకు నిజమైన ప్రైజ్ నువ్వు మారడమే నాన్న ఆనందంతో ఈ కథ ముగుస్తుంది. ప్లాస్టిక్ పట్ల ఏమాత్రం బాధ్యతలేని ఒక నిర్లక్ష్యపు వ్యక్తికి, ఆ ప్రకృతి ఎలా గుణపాఠం చెప్పింది అన్నదే కథాంశం. దర్శకుడుగా బి.బాలాజీ, నిర్మాతగా వై.శ్రీనివాస ఆచారి వ్యవహరించారు. ఐక్య నేషనల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ పాఠశాలలో చదివే విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సింగల్ యూజ్ ప్లాస్టిక్‌లో అవగాహన కార్యక్రమంలో భాగంగా 'ఫీల్ ద బాటిల్ విత్ ప్లాస్టిక్ వేస్ట్' అనే స్లోగన్‌తో మన ఇంట్లోకి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను మనం వాడి పడవేస్తే ప్లాస్టిక్ బాటిల్‌లో నింపి బయటపడవేసే విధానాన్ని విద్యార్థుకు నేర్పిస్తూ వారికి బహుమతులు ఇచ్చే కార్యక్రమం పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తుంది. సామాజిక బాధ్యతలో భాగంగా ఉగాది నుంచి వాకింగ్ ట్రాక్స్ దగ్గర అవగాహన కల్పిస్తూ చేతి సంచులు అందజేస్తుంది. ఐక్య నేషనల్ ఫౌండేషన్, అధ్యక్షులు శివరామరాజు, వైఎస్ ఆచారి వ్యవస్థాపక అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు బి.బాలాజీ, అప్పారావు, కీరు వై.కృష్ణ, చిరంజీవి, మృదుల, మీకోసం షార్ట్ ఫిలిం యూనిట్ సభ్యులను రఘురామకృష్ణరాజు అభినందించారు.


షార్ట్ ఫిలిం బృందాన్ని అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

నెలనెలా ఉచిత వైద్య సేవలు కొనసాగిస్తాం

మిషనరీ హాస్పటల్ సిస్టర్ వందన

ప్రజాశక్తి - మొగల్తూరు

పరీక్షిస్తున్న వైద్యులు

మొగల్తూరు మిషనరీ హాస్పిటల్‌లో నెల నెలా ఉచిత వైద్య సేవలు కొనసాగిస్తామని సిస్టర్ వందన తెలిపారు. స్థానిక అవర్ లేడీ అఫ్ డాలర్స్(మిషనరీ) హాస్పటల్ ఆవరణలో భీమవరానికి చెందిన సెయింట్ మేరీస్ హాస్పిటల్ వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు వంద మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సిస్టర్ సిమిలి, డాక్టర్ పాల్, మోసెస్, సిస్టర్ గ్రాసియా, లీవర్ట్, ఎఎ అనిట్ ఈ శిబిరంలో సేవలందించారు.

చించినాడలో వ్యకాస గ్రామ మహాసభ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ అరుంధతి పేటలో ఆదివారం మధ్యాహ్నం స్థానిక అరుంధతి పేట కమ్యూనిటీ హాల్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ మహాసభ జరిగింది. ఈ సమావేశానికి బుంగ శంకరుడు అధ్యక్షత వహించారు. సభకు ముఖ్య అతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మాసవరపు సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక ఏళ్లుగా ఉపాధి హామీ చట్టంను పటిష్టంగా అమలు చేయాలని, కూలీలకు కనీస వేతనం రూ.600 ఇచ్చి ఏడాదికి 200 పని దినాలను కల్పించాలని ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ డిమాండ్స్ నెరవేరాలంటే కార్మికులంతా సమిష్టిగా ఏకతాటిపైకి రావాలన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా గొల్ల పెద్దిరాజు, పల్లేరు శ్రీనివాసులను సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ప్రజాసంఘాల నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ఉపాధి హామీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెస్ట్‌బెర్రీ హైస్కూల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

ప్రజాశక్తి - కాళ్ల

ఈనెల 20వ తేదీన విజయవాడ నగరంలో టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరిగిన 7వ ఎడిషన్ టైమ్స్ బిజినెస్ అవార్డ్స్ కార్యక్రమంలో వెస్ట్‌బెర్రీ హై స్కూల్‌కు 'లీడర్షిప్ ఇన్‌నెక్స్ట్-జెన్ స్కూలింగ్' అవార్డు లభించడం ఎంతో ఆనందదాయకమని వెస్ట్‌బెర్రీ హైస్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాలు, ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నానన్నారు. వెస్ట్‌బెర్రీ హై స్కూల్ సాధారణ విద్యా పద్ధతులకే పరిమితం కాకుండా, కొత్త తరానికి అనుగుణంగా ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్స్, హొలిస్టిక్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, అలాగే టెక్నాలజీ ఆధారిత లెర్నింగ్‌కు ముందుకు తీసుకువస్తోందన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తక జ్ఞానంతో కాకుండా భవిష్యత్తులో నాయకత్వం వహించే లక్షణాలను పెంపొందించుకోవడానికి ఇక్కడ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. విద్యారంగంలో నూతన దారులు చూపిస్తూ, ప్రతి విద్యార్థి సమాజానికి బాధ్యతగల పౌరుడిగా ఎదగాలని వెస్ట్‌బెర్రీ లక్ష్యంగా ఉన్నామన్నారు. ఈ అవార్డు ఆ కృషికి వచ్చిన అర్హమైన గుర్తింపుగా నిలిచిందన్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం ఆదివారం పాఠశాలలో పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఇది కేవలం తమ స్కూల్‌కే కాదు, ప్రతి విద్యార్థి కలలకూ దక్కిన గౌరవమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత కృషి చేస్తామన్నారు. ప్రిన్సిపల్ సారా స్మితా సాలి, ఎఒ పి.రమేష్ రాజు, బిడిఎం ఎన్.ఆశాకిరణ్ పాల్గొని అవార్డును స్వీకరించారన్నారు.



మంత్రి నుంచి అవార్డును అందుకుంటున్న స్కూల్ డైరెక్టర్

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదులు

తొలగించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదలు

మండలంలోని కొత్తటలో 216 జాతీయ రహదారి పక్కన ఉన్న హై టెన్షన్ విద్యుత్ సరఫరా లైన్‌కు ఉన్న విద్యుత్ స్తంభానికి పొదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. పొదులు విద్యుత్ వైర్ల వరకు వెళ్లడంతో వర్షాలకు వర్షం కురిసిన సమయంలో విద్యుత్ షాకుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ప్రజాశక్తి విద్యుత్ శాఖ ఎఇ ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లగా పొదులను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

చెక్కులు అందజేస్తున్న సభ్యులు

బాధితులకు వసుధ ఫౌండేషన్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు పేద రోగులకు వసుధ ఫౌండేషన్ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన అంగర గంగరాజు, చల్లాబత్తుల కోట గంగరాజు కొంతకాలంగా పెరాలసిస్ కారణంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. అదే గ్రామానికి చెందిన కూర్మా లక్ష్మి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరు అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చులకోసం ఇబ్బందులు పడుతున్నారు. వీరి పరిస్థితి తెలిసి వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుద్ధరాజు ఆదివారం వారికి వసుధ ఫౌండేషన్ పంపించిన చెక్కులను పాలకొల్లులోని బుద్ధరాజు గృహం వద్ద బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయం అందుకున్న బాధితులు, వారి కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్రామరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కట్టెముక్కల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై మహిళా రైతు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వెలివెల గ్రామంలో యువ మహిళా రైతు పాము కాటుకు గురై మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కేతా దేవి(30) అనే మహిళ రైతు శనివారం మధ్యాహ్నం తను సాగు చేస్తున్న కూరగాయల తోటలోనికి వెళ్లి తన పనులు చేసుకుంటున్న సమయంలో పాము కాటు వేసిందని, వెంటనే వైద్యం కోసం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కానీ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం ఐదున్నర గంటలకు ఆమె మరణించింది. ఆమె భర్త వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె కలరు. భర్త కేతా వీర వెంకట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ సిహెచ్‌విఎన్.మూర్తి కేసు నమోదు చేశారు.

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - మొగల్తూరు

వృద్ధురాలిపై దాడి చేసి బంగారు నగలు అపహరించిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేశామని సిఐ జి.దుర్గాప్రసాద్ తెలిపారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. కాళీపట్నం తూర్పు పంచాయతీ రంగా బొమ్మ సెంటర్‌కు చెందిన బళ్ల సూర్య ఆదిలక్ష్మి దగ్గర అదే గ్రామానికి చెందిన వడ్రంగి పనిచేస్తూ జీవిస్తున్న మారోజు శ్రీనివాస్ గతంలో రూ.10 వేలు అప్పు తీసుకున్నాడు. మరో రూ.10 వేలు అప్పు ఇవ్వవలసిందిగా కొన్ని రోజులుగా అడుగుతున్నాడు. ఆమె ఇంట్లో ఉన్న చెక్కలు అమ్మి పెట్టమని అడిగింది. దాని నిమిత్తం ఆమె ఇంటిలోకి వెళ్లాడు. ఇంటిలో ఉన్న చెక్కలను చూపిస్తూ ఉండగా అక్కడే ఉన్న చెక్క తీసుకుని ఆమె తలపై కొట్టాడు. మెడలోని బంగారు గొలుసు లాక్కుంటూ ఉండగా ఆమె ఒక చేత్తో గొలుసు పట్టుకుంది. ఆ గొలుసు కొంత భాగం తెగి శ్రీనివాస్ చేతికి వచ్చింది. ఆమె చెవి దిద్దులను కూడా బలవంతంగా లాక్కున్నాడు. దుండగుడు ఇంటి వెనక గుమ్మం నుండి పరారయ్యాడు. ఆమె అరుస్తూ ఉండగా ఇంటిపక్కల వారు, కుటుంబ సభ్యులు అత్యవసర వాహనంలో నరసాపురంలోని ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అమలాపురంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు గ్రామంలోని చెరువుల వద్ద ఉన్నట్టు గుర్తించి ఎస్ఐ జి.వాసు తమ సిబ్బందితో వెళ్లి శ్రీనివాస్‌ని అరెస్ట్ చేశారని సిఐ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పంచారామ క్షేత్రం పాలకొల్లు శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్ చెప్పారు. ఈసారి 11 రోజులు వివిధ అలంకరణలతో అమ్మవారిని అలంకరిస్తారని చెప్పారు. 22న సాయంత్రం 6 గంటలకు శ్రీఅమ్మవారి ప్రత్యేక అలంకారాలను మంత్రి నిమ్మల రామానాయుడు, సూర్యకుమారి దంపతులు ఆవిష్కరిస్తారని చెప్పారు.